


# పిచ్చివాడు

గౌరీ శంకర్

నీలి చక్కగా పాడుతూంది.

అవును. రాళ్లల్లోనే రత్నాలుంటాయి. ఆ చవుకు (సరుగుడు) తోపులో ఆమె పాడుతూ వస్తూంటే కోయిల తన గానాన్ని వినిపిస్తున్నట్లుంది. కాని ఆ కంఠంనుండి ఏవో అపశ్రుతులు వినిపిస్తున్నాయి. జీవితంలో కూడ అంతే. అడుగడుగునా నిరాశా నిస్పృహలు కలుగుతుంటాయి. మధురజీవితంలో నిరాశ. నిరాశలో ఏదో మధురానుభూతి. జీవితరహస్యం మనకు అర్థంకాదు.

"ఎక్కడుండవో సిన్నోడ — [illegible] ఉన్నవో సిన్నోడ".

పాటపాడుతూ ఆమె కాలిబాటలో నడుస్తూ వుంది. సూర్యబింబం ఎర్రదనాన్ని వీడింది. ఆమె చేతిలో కొడవలి వుంది. చుట్టూ చవుకు

ఎక్కడున్నాడో సిన్నోడు? ఎట్టా ఉన్నాడో? వస్తానని రాకుండాడు. ఎలా గుంటది మనసు? సిన్నోడు గూరమైనాడా? అట్టాంటి ఎతలు పెట్టిన సిన్నోడు వచ్చినాడు. తీసుకెల్లి పోయినాడు-బస్తీకి. పిచ్చోడు.

ఆమెది కోయిల కంఠం. ఎంతో చక్కగా పాడుతుంది. కాని కంఠంలో అపశ్రుతులు.

చెట్లు దట్టంగా ఉన్నాయి. ఆ చెట్లపొదవు అనురాగపు అంచులను చూపిస్తున్నట్లుంది. పాడిపాడి ఆమె గొంతు అలసిపోయింది గామోసు, బొంగురుపోయింది.

“వస్తానని రాకుంటివో — ఎలాగుంటది నా మనసు”.

సూర్యుని కిరణాలు లేతగా ఆమె నుదుటి మీద పడ్డాయి. ఉన్నట్లుండి ‘అబ్బ’ అని కిందకు వంగింది. ఆమె కాలికి ముల్లు గుచ్చుకుంది. కాలినుండి తీసివేస్తూ “పెద్దముల్లు గుచ్చుకొన్నది... నొప్పి” అనింది బాధగా. ముల్లు వలన శరీరానికే బాధ. మరి హృదయబాధను ఎవరు తీరుస్తారు?

“వస్తానని రాకుంటివో — ఎలాగుంటది నా మనసు”.

ఆమెకు వెంటనే నరసింహం జ్ఞాపకం వచ్చాడు. ‘నా సిన్నోడు’ అనుకుంది.

“ఇప్పుడే వస్తనన్నోడు యింకా రాడేంగందా? నేను సిన్నోడునుంచి దూరమ్మైతినా?” అని అనుమాన పడింది.

ఆ ఆలోచనలతో చేతిలో ఉన్న కొడవలితో తన తల నరికేసుకోనా - అనిపించింది నీలికి. మరలా తన సిన్నోడు తనకు దూరంకాడని అనుకుంది. చవుకుతోపు దాటి ఉత్తరంగా పొలాలకేసి నడవసాగింది. పైరు ఏపుగా పెరిగి పచ్చగా కనిపిస్తోంది. ఆ పచ్చదనంలోనే ఎన్నో జీవితాలు జీర్ణించిపోయి ఉన్నాయి!

నరసింహానికి, తనకు పెళ్లయి ఇప్పటికి రెండుసంవత్సరాలు. అతడిని తను ఎంతగానో ప్రేమించింది. అతడూ అంతగానే తన్ను ప్రేమించాడు. పెళ్ళయిన తొలి దినాల్లో నరసింహం ఓనాడు తోటలో తనతో మోటు సరసం ఆడేటప్పుడు—అబ్బ! ఎంత తీపిగా వుండింది ఆ అనుభూతి. ఆమె నరసింహంతో తన మొదటి రోజులు జ్ఞప్తికి తెచ్చుకొని సిగ్గుపడింది.

ఆమె నల్లని బుగ్గలు సంధ్యాకాంతిలో మెరిశాయి. నీలి చాలా అందమైంది. కానీ ఆమె అందమంతా ఆమె చేతిలో వున్న కొడవలిలో దాగిపోయింది. దానికే తన అందాన్నంతా అర్పించింది. పొలాల గట్లమీద గడ్డి బాగా పెరిగి ఉంది. నీలి పచ్చగడ్డిని కోయటం మొదలెట్టింది.

# పిచ్చివాడు

నరసింహం స్మృతిపథంలో మెదులుతున్నాడు. ఆనాడు! ఇక్కడే! ఈ పచ్చికలోనే! ఆమెకు సిగ్గు ముంచుకొచ్చింది. ముఖాన వెంటనే ఆనందరేఖలు అలుముకొన్నాయి. ఇప్పుడెక్కడున్నాడో! ఇంకా వస్తాడో రాడో! తనేం పాపం చేసింది?

నరసింహం బస్తీకి పనికోసం పోయాడు. సుఖంగా పల్లెజీవితాన్నే యింతవరకు గడిపినా దానిమీద మోజు పోయింది. బస్తీలో ఉండే ఆనందం పల్లెలో లేదని అభిప్రాయపడ్డాడు. ఏదో పని సంపాదించుకోవడంకోసం, దూరపుకొండలు నునుపన్నా, నీలి వద్దని చెప్పినా వినిపించుకోకుండా పోయాడు.

నీలి గడ్డికోయడం ఆపేసింది. కోసిన గడ్డిని మోపుకట్టి కొడవలిని దానికి గుచ్చి, నెత్తిమీద మోపు పెట్టుకొని యింటికి బయలుదేరింది.

అప్పటికి చాలా పొద్దెక్కింది. చవుకుతోపు తరువాత ఊరి పొలిమేర దాటి ఓ పాడుపడ్డ దేవాలయంవద్ద ఆగింది. నెత్తిన ఉన్న పచ్చి గడ్డిమోపు గుడి సెలువలవున్న అరుగు మీద వుంచి కొంచెంసేపు, తరువాత మరలా నడక సాగించింది. గ్రామంలోని పెద్దవీధి మలుపు దాటేటప్పటికి నరసింహం ఎదురుపడ్డాడు. నీలి ఆనందం కొండెక్కింది. నీరసించిపోయిన ఆమె కళ్ళు ప్రేమపూరితాలయ్యాయి.

నరసింహంలో కొద్దిగా ఏదో మార్పు వచ్చినట్లు నీలి కనిపెట్టింది. “ఇప్పుడే వస్తనన్నోడివి యిన్నిదినాలుంటివే! నాకు ఎంత యిదిగా ఉండింది” అనింది.

అయినా పోయినవాడు వచ్చాడు. అదే పదివేలనుకొని సంతోషపడింది. నరసింహం నీలి తలమీదనుంచి గడ్డిమోపు తననెత్తికి ఎత్తుకొన్నాడు. ఇద్దరూ మరలా కబుర్లు చెప్పుకుంటూ నడక సాగించారు.

నరసింహం బస్తీనుంచి వచ్చినప్పటినుంచి చాలా కులాసాగా ఉన్నాడు. ఇంటికి పోయిన తరువాత యిన్ని మెతుకులు తిని “ఎంటనే బస్తీకి పోవాల” అన్నాడు. అతడికి బస్తీలో పని దొరికింది. భుజంగరావుగారి ఇంటిలో తోటమాలిగా కుదిరాడు.

గ్రామపెద్దలు, బంధువులు పోవద్దన్నా అతడు లెక్కచేయకుండా బస్తీకి ప్రయాణమయ్యాడు. నీలి కన్నీళ్ళు పెట్టుకుంది. ప్రయాణమై పోతుంటే కన్నీళ్లేమిటని మందలించాడు నరసింహం. బస్తీలోని అన్ని హంగులూ నరసింహాన్ని ఆకర్షించాయి.

‘బస్తీలో వాళ్ల బతుకులే బతుకులు’ అని అతడు తలంచాడు.

“ఏదో ఒక పని చేసుకుంటే కావలసినంత డబ్బు వస్తుంది. పల్లెల్లో బండచాకిరి చేసినా కడుపు నిండదు” అని ఎవరో తనతో ఓసారి అన్నమాటలు జ్ఞాపకం వచ్చాయాతడికి. అసలు ఆ ఉద్దేశ్యంతోనే అతడు బస్తీకి పోయివచ్చాడు.

“చూపిస్తానే స్వరగం బస్తీలో” అని నీలికి ధైర్యం చెప్పాడు.

నీలికూడ అతడిని అనుసరించింది. ఇద్దరూ రైలుబండి ఎక్కారు. ఎప్పుడూ రైలు ఎక్కని నీలికి యిప్పుడు రైలులో ప్రయాణం చేస్తుంటే ఏదో వింతగా తోచింది. రైలు అక్కడక్కడా ఆగిపోవడము, కూతకూసి మరలా బయలుదేరడము ఆమెకు ఆశ్చర్యాన్ని కలిగించింది. రైలు పట్టాలమీద పరుగెత్తుతున్నంతసేపు దాని కెటువంటి ప్రమాదమూ లేదు. మానవుడుకూడ అంతే. జీవన యాత్రలో ఆగుతూ, ఆగుతూ ఓ బాటలో పయనిస్తుంటాడు. కాని తాను అనుసరించే బాట తప్పాడంటే గోతిలో పడ్డట్లే!

భుజంగరావు యింటిలో నీలికి కూడ దాసీగా పని దొరికింది. నరసింహం పనిలో మంచి నేర్పరి. చెప్పిన పని ఏదైనా అతి సులువుగా చేయగల సమర్థుడు. అతడి కింద భుజంగరావు తోట శోభ హెచ్చింది. నరసింహం ఉత్సాహం చూపిస్తూ పని చేస్తున్నందుకు భుజంగరావు లోపల సంతోషపడ్డాడు. నీలికి మాత్రం తాను బస్తీలో దాసి పనిచేయడం ఏమాత్రమూ యిష్టంలేదు. పల్లెలో ప్రకృతిలో లీనమయిన గత జీవిత దినాలు తలచుకొని తిరిగి పల్లెకు పోవా లనిపించిం దామెకు. నరసింహం నీలికి బస్తీలో ఉండడం యిష్టం లేనట్లు తెలుసుకొని ఆమెను సంతోష పెట్టటానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

భుజంగరావు ఇంచుమించు ధనికుడనే చెప్పాలి. పైకి సౌమ్యుడుగా కనిపించినా మానవత్వానికి విలువ కట్టలేనివాడు. ధనాన్ని ఏవిధంగానైనా సంపాదించాలని అతడి ప్రయత్నం. దానికి తోడు ఇతర దుర్గుణాలు ఉండడం సహజమే. తొలినాడే నీలి అతడిని ఎంతగానో ఆకర్షించింది.

ఆమె అందమంతా సూర్యుని వేడికి కరగిపోయిందనుకున్నాడు భుజంగరావు. నిజంగా నీలి అందమైందే. కొద్దిగా నల్లగా ఉన్నా, అమెది అందమైన, నిండైన విగ్రహం.

ఉదాసీనత చూపుతూ ఓరోజు “నరసింహం,

నీ కృషితో ఈతోట చాలా వృద్ధి పొందిందోయ్. ఇన్నాళ్ళకు ఈ ఇంటికి పూర్తి శోభ కలుగుతూంది" అన్నాడు భుజంగరావు.

"ఏదో బాబూ! నా సేతకొంది సేశాను"

"ఈ నాటినుంచి నీజీతం ఐదు రూపాయిలు పెంచుతున్నాను" అని తన ఆదరాన్ని వెలిబుచ్చాడు.

"మీ దయ. మ ... న్నాడు చేతులు కట్టుకొని నవ్వు మొగంతో నరసింహం.

బస్తీకి వచ్చి ఓ సంవత్సర మయ్యేసరికి నరసింహం వేష భాషలలో కొద్దిగా మార్పు వచ్చింది. అతడు బస్తీ జీవితానికి అలవాటు పడ్డాడు. కాని నీలికి మాత్రం పట్టణ వాతావరణం ఏమాత్రమూ నచ్చలేదు. పంజరంలోని పక్షిలా ఉండడము ఆమెకు గిట్టలేదు. అసలు ఆ జీవితాన్నే ఏవగించుకుంది. ఇలా ఉంటున్న నీలిమీద నరసింహానికి కోపం వచ్చింది.

"కూడు గుడ్డ కావాల్సినంత ఉంటే యింకా ఎందుకే — ఆ దిగులు?" అన్నాడు.

అన్నీ ఉన్నా ఆనందం, స్వేచ్ఛలేని బ్రతుకు దుర్లభం. అంతేకాకుండా ఆమెకు భుజంగరావును చూచినప్పుడల్లా మనసులో ఏదో తెలియని భయం కలుగుతూండేది. అతని చూపులు ఆమెను హరించి వేస్తాయి. మీసాలు మెలి వేస్తూ తనవైపు చూసి నవ్వుతుంటే ఆ నవ్వులో విషం వ్యాప్తమై ఉన్నదనిపించేదామెకు.

రోజులు గడిచేకొద్దీ నీలికి మనసులో ఆందోళన అధికమైంది. తను అక్కడనుండి పారిపోవా లనుకుంది. కాని ఇన్ని రోజులు తనను ప్రాణప్రదంగా ప్రేమిస్తున్న తన నరసింహానికి ద్రోహం చేయలేదు. నరసింహం కోసం అక్కడనే ఉండటానికి నిశ్చయించుకుంది

* * *

"నరసింహం! చినబాబు క్రోటను మొక్కలు కొన్ని పంపిస్తానన్నాడు. కాని యింకా పంపలేదు. నీవుపోయి తీసుకురా. ఈ రాత్రికి ఉండవలసి వచ్చినా ఉండి రేపైనా తీసుకురా" అని ఓనాడు నరసింహాన్ని, భుజంగరావు బస్తీకి రెండు మైళ్ల దూరాన ఉన్న గ్రామంలో ఉంటున్న తన బాల్యస్నేహితుడు చినబాబు దగ్గరకు పంపాడు.

తను ఇన్నాళ్లవరకూ ఎదురు చూస్తున్న శుభ ముహూర్తం ఆసన్నమైంది భుజంగరావుకు. తన కోరిక ఈ నాడు ఫలిస్తుందని గంతు వేశాడు. మేడమీద నీలి తన గదిని ఊడుస్తున్నదని తెలుసుకొని మెల్లగా అడుగులు వేస్తూ గదిలో ప్రవేశించాడు. నీలి గది శుభ్రంచేయడం పూర్తిచేసి గది విడిచి వెళ్లిపోయింది.

"నీలీ ఇటురా!" అన్నాడు.

"ఏం బాబూ!"

"అదిగో ఆమూల ఉన్న పుస్తకాలు టేబిల్ మీద సరిగా పెట్టు."

పుస్తకాల ముఖమెప్పుడూ చూడని నీలి, టేబిలుపైన ఒక పుస్తకం మీద వేరొక పుస్తకం పెడుతూ, పుస్తకాలు రంగురంగుల అట్టలతో ఉండడము చూసి విస్తుపోయింది.

భుజంగరావు హృదయం పరవళ్ళు త్రొక్క సాగింది.

"నీలి......" బొంగురు గొంతుతో అన్నాడు దగ్గరగా పోతూ.

"ఏంటి బాబు!"

"నీవు చాలా అందంగా ఉన్నావు నీలి!'

"ఏంది బాబు మీరు మాట్లాడేది నాకు తెలీటం లేదు." అనింది.

"ఎంత మధురకంఠం నీలిది. కాని అపశ్రుతులు. ఆ— ఇటు ఓసారి చూడు" అంటూ ఆమెను గట్టిగా దగ్గరకు లాక్కున్నాడు.

"ఇడువు—ఇడువు" అంటూ తప్పించుకోచూచింది నీలి. కాని ఆమెకు సాధ్యం కాలేదు. గది అంతా చీకటి. ఆ పెనుచీకటిలో తోకచుక్క ప్రయాణమై పోయినట్లయింది.

నరసింహం చినబాబు దగ్గరకు పోయేసరికి మధ్యాహ్నం రెండు గంటలైంది. చినబాబు మేనేజరు కొడైకానల్ నుంచి రాత్రికి వస్తాడని తెలుసుకొని, అతడు తేనున్న పూల మొక్కలకోసం ఆరాత్రికి ఆగాడు. మేనేజరు ఆరాత్రి బండికి వచ్చాడు. తెల్లారి ఉదయమే పూల మొక్కలతో నరసింహం బస్తీకి బయలుదేరాడు.

మొక్కలు తీసుకుని వస్తున్న నరసింహాన్ని చూసి భుజంగరావు వంటవాడు ఆదేలా ముఖంపెట్టాడు. కాని, అసలు సంగతి చెప్పటానికి నోరురాలేదు. సరాసరి నరసింహం భుజంగరావు యింటికి వచ్చాడు. గృహప్రాంగణంలో ఉన్న జనాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. కాపలావాడు ఎదురు వచ్చి "నీ...నీ..." అని ఏదో చెప్పబోయి ఆగిపోయాడు.

పూల మొక్కలు గిరాటు వేసి నరసింహం జన సమూహాన్ని చీల్చుకుంటూ ముందుకు పోయాడు. నీలి కింద పడివుంది. ఒక్కసారి నరసింహం గుండె ఆగినట్లయింది. "నీలి...నీలి' అంటూ శవంపైన పడిపోయాడు.

తనే సర్వస్వం అనుకున్న నీలి తనను విడిచి వెళ్ళిపోయింది.

"నేనేం తప్పు చేస్తిని? ఎందుకు బావిలో పడ్డాది?"

అతని హృదయం క్షోభతో కుమిలిపోయింది. ఆమె వద్దన్నా బస్తీకి తీసుకవచ్చాడు తను. తన సర్వస్వం అర్పించటానికి సిద్ధంగా ఉన్న నీలికి తన కానుక ఇదేనా? ఎందుకు నీలి ఆత్మహత్య చేసుకుంది ?

అతడికి బుర్ర చెడిపోయినట్లయింది. తన నీలే పోయినపుడు తనకీ లోకమెందుకు? నీలి శవాన్ని ఒక్కసారి కళ్లారా చూసి మెల్లగా వీధికేసి నడవసాగాడు. నీలికి దహన సంస్కారం? అతడి కేమీ పట్టలేదు. చాలా దూరం పోయాడు. టవర్ క్లాక్! గంట పన్నెండు కొట్టింది. ఆ దెబ్బలన్నీ తన గుండెకు తగిలాయా అన్నట్లుగా ఏవోమాటలు అతడికి వినబడ్డాయి.

"పాపం! నీలి అభాగ్యురాలు! భుజంగరావు ఆమె శీలాన్ని చెడిపాడు. ఆ అవమానాన్ని భరించలేక తోటబావిలో పడి మరణించింది. ఆమె కులంలో తక్కువైనా గుణంలో తక్కువది కాదు."

తీక్ష్ణంగా ఒక్కసారి ఆ మాటలు వినబడ్డ వైపుకేసి చూశాడు. ఆ మాటలు యింకొకరితో చెపుతున్న భుజంగరావు పని మనిషి ఒకడు వెళ్లిపోవడం చూశాడు. నిశ్చేష్టుడై కొద్దిసేపు నిలబడ్డాడు. వెంటనే కోపంతో కాగిపోతూ పళ్ళు పటపటా కొరుకుతూ, "ఆ వాడా! నా నీలిని పొట్ట పెట్టుకున్నది! వాడి నాయాలి అంతు తేలుస్తాను" అంటూ వెనుకకు తిరిగి పరుగెత్తడం మొదలుపెట్టాడు.

వీధిలో పోయేవారంతా పరుగెత్తుతున్న అతడిని చూసి "ఎవరో పిచ్చివాడు" అనుకున్నారు. ★

## ఆమని అందాలు

### రాజ్యం

అరవింద పుష్పాలు
ఆనంద బాష్పాలు
అలరారు మల్లియలు
ఆమనికి అందాలు.

గిజిగాని కిచకిచలు
పిచిగాని పకపకలు
కోకిలా కుహు కుహులు
ఆమనికి అందాలు.

చెంగారు వ్రీడలో
శృంగార క్రీడలు
పొంగారు జవ్వనులు
ఆమనికి అందాలు.

సెలపటి జలజలలు
నిశినాధు తళతళలు
కెరటాల మిలమిలలు
ఆమనికి అందాలు.

వలపు నిండిన ఎదలు
తలపు నింపిన సుధలు
మరునిరా చిలుకలు
ఆమనికి అందాలు.